# పోలీసు ఉద్యోగాలకు ప్రిలిమ్స్

- రాతపరీక్ష, దేహదారుఢ్యంలో నెగ్గినవారికే మెయిన్స్
- ఐదు కిలోమీటర్ల పరుగు పందెం పూర్తిగా రద్దు
- సివిల్స్, ఏఆర్ విభాగాల్లో మహిళలకు రిజర్వేషన్లు
- సంస్కరణల దస్త్రానికి ముఖ్యమంత్రి ఆమోదం

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు ఉద్యోగాల భర్తీకి తొలిసారిగా ప్రిలిమ్స్ నిర్వహించనున్నారు. తొలుత ప్రాథమిక పరీక్షగా రాతపరీక్షను నిర్వహించి అనంతరం దేహదారుఢ్య పరీక్షలు చేపడుతారు. వీటిల్లో ఎంపికైన అభ్యర్థులకు మాత్రమే మెయిన్స్ రాసేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు పోలీసు నియామక మండలి రూపొందించి పంపించిన సంస్కరణల దస్త్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించిన తుది ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో వెలుపడే అవకాశముంది. ముఖ్యాంశాలు..



- ప్రాథమిక అర్హత పరీక్షగా నిర్వహిస్తున్న అయిదు కిలోమీటర్ల పరుగు పందెంను పూర్తిగా ఎత్తివేశారు.
- సివిల్ ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల్లో 33 1/3 శాతం, అర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) విభాగంలోని పోస్టుల్లో 20 శాతం మేర మహిళలకు రిజర్వేషన్ కల్పించారు. ఆయా పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు లేకపోతే వాటిని పురుష అభ్యర్థులతో భర్తీ చేస్తారు.

ప్రిలిమ్స్ పరీక్ష: ఎస్సై పోస్టులకు సంబంధించి 200 మార్కులకు, కానిస్టేబుల్ పోస్టులకు 100 మార్కులు పరీక్షలు ఉంటాయి. ఇది కేవలం అర్హత పరీక్ష మాత్రమే. దీనిలో ఓసీ అభ్యర్థులైతే 40 శాతం, బీసీలు 35 శాతం, ఎస్సీ, ఎస్టీలు 30 శాతం మార్కులు సాధించాలి. ఎస్సై అభ్యర్థులు చెరో 100 మార్కులకు రెండు పేపర్లు రాయాల్సి ఉంటుంది. ఈ రెండింటిలోనూ వేర్వేరుగా నిర్దేశిత అర్హత మార్కులు తప్పనిసరిగా సాధించాలి. కానిస్టేబుల్ అభ్యర్థులకు మాత్రం ఒకటే పేపరు ఉంటుంది. ప్రశ్నలన్నీ పూర్తిగా

(మిగతా 2లో)

# పోలీసు ఉద్యోగాలకు ప్రిలిమ్స్

(మొదటి పేజీ తరువాయి) బహుళైచ్ఛిక విధానం లోనే ఉంటాయి. గణితం, రీజనింగ్, జనరల్‌స్టడీస్ వంటి అంశాలతో ప్రశ్నపత్రం ఉంటుంది.

**దేహదారుఢ్య పరీక్షలు:** ప్రిలిమ్స్‌లో ఎంపికైన అభ్యర్థులకు మాత్రమే 100 మీటర్లు, 1600 మీటర్లు, లాంగ్‌జంప్ విభాగాల్లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. గతంలో 100 మీటర్లు, 800 మీటర్లు, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్.. మొత్తం అయిదు విభాగాల్లో పోటీలు ఉండేవి. సివిల్ అభ్యర్థులైతే వీటిలో కనీసం మూడు విభాగాల్లోనూ, ఏఆర్, ఏపీఎస్పీ అభ్యర్థులైతే అయిదు విభాగాల్లోనూ ప్రతిభ కనబరచాల్సి వచ్చేది. షాట్‌పుట్, హైజంప్‌లను తొలగించారు. 800 మీటర్ల స్థానంలో 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించనున్నారు.

**మెయిన్స్ పరీక్షలు:** దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే మెయిన్స్ పరీక్షలు రాసేందుకు అవకాశముంటుంది. కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్‌లో రెండు పేపర్లు...చెరోపంద మార్కులకు ఉంటాయి. ఎస్సై అభ్యర్థులకు నాలుగు పేపర్లు 600 మార్కులకు ఉంటాయి. వీటిలో ఆంగ్లం, తెలుగు/ ఉర్దూ రెండు పేపర్లు (చెరో 100 మార్కులు చొప్పున 200 మార్కులు) ఉంటాయి. ఈ రెండు పేపర్లలో కేవలం అర్హత మార్కులు మాత్రమే సాధిస్తే సరిపోతుంది. వీటిని తుది మార్కుల్లో పరిగణనలోకి తీసుకోరు. 50 శాతాన్ని అర్హత మార్కులుగా నిర్దేశించారు. ఈ రెండు పేపర్లు పూర్తిగావివరణాత్మక విధానం (డిస్క్రిప్టివ్)లో ఉంటాయి. మిగతా రెండు పేపర్లు చెరో 200 మార్కులు చొప్పున మొత్తం 400 మార్కులకు ఉంటాయి. గతంలో నిర్వహించిన ఎస్సై పరీక్షల మాదిరిగానే ఈ పరీక్ష ఉంటుంది. పదో తరగతి స్థాయి సబ్జెక్టులతో ఈరెండు పేపర్లు ఉండనున్నాయి.

## అంతా అంతర్జాలం ద్వారానే..



దరఖాస్తుల స్వీకరణ మొదలు హాల్‌టికెట్ల జారీ, కీ విడుదల వరకూ ప్రతి ప్రక్రియను అంతర్జాలం ద్వారానే నిర్వహిస్తాం. రెండు రోజుల్లో వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నాం. దరఖాస్తు చేసుకున్నది మొదలు ప్రతి దశలోనూ సమాచారాన్ని అభ్యర్థుల సెల్‌ఫోన్లకు, ఈ మెయిల్ చిరునామాలకు ఎప్పటికప్పుడు పంపిస్తుంటాం. రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించాలని భావిస్తున్నాం. పరుగు పందేలను గతంలో మాదిరి నగరాల శివారుల్లో కాకుండా మైదానాల్లో నిర్వహించాలని యోచిస్తున్నాం. 1600 మీటర్ల దూరాన్ని నాలుగు రౌండ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎన్ని నిమిషాల్లో అభ్యర్థి నిర్ణీత దూరాన్ని చేరుకున్నాడన్నది తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఆర్ఎఫ్ఐడీ సాంకేతికతను వినియోగించనున్నాం.

—అతుల్‌సింగ్, ఛైర్మన్, రాష్ట్రస్థాయి పోలీసు నియామక మండలి